ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు






కాసుల కోసం కోతలు

- అవసరం లేకున్నా గర్భిణులకు సిజేరియన్లు
- ఐదు ఆస్పత్రులకు నోటీసులు
- మరో 99కి సన్నద్ధం
- గుంటూరు జిల్లాలో 104 ఆస్పత్రుల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రైవేటు ఆస్పత్రుల్లో గర్భిణులకు సిజేరియన్లు ఇబ్బడి ముబ్బడిగా జరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీ కింద అధిక బిల్లుల వసూలు కోసం అవసరం ఉన్నా లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ గుర్తించింది. ఈ విషయంపై జిల్లాలో వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లాలోని 104 ఆస్పత్రులను పరిశీలించగా 99 ఆస్పత్రుల్లో సిజేరియన్లు అధికంగా చేస్తున్నట్టు గుర్తించారు. రోగుల నుంచి వేలాది రూపాయాలు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్యశ్రీ నుంచి వచ్చే సొమ్ముతో పాటు రోగుల బంధువుల నుంచి కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని రోగుల బంధువులను కంగారుపెట్టి సిజేరియన్లు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ అధికారుల విచారణలో నిర్ధారణైంది. ప్రధానంగా ఎక్కువ మంది ముహూర్తాలు చూసుకుని డెలివరీకి వస్తుండటం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. దీంతో అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారు. అంతేగాక శిశువు అడ్డం తిరిగిందని, శిశువు ఉమ్మనీరు తాగేసిందని కంగారు పెడుతున్నట్టు విమర్శలున్నాయి.



సాధారణ కాన్పునకు రూ.8 వేలు, సీజేరియనుకు రూ.14 వేలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ధేశించినా రోగుల నుంచి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూళు చేస్తున్నారు. సాధారణ కాన్పునకు అవకాశం ఉన్నా రోగుల

2లో



స్వాధీనం చేసుకున్న విత్తనాలతో విజిలెన్స్, వ్యవసాయాధికారులు

రూ.2.61 లక్షల నకిలీ మిర్చి విత్తనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏటుకూరు రోడ్డులోని 'సింధూరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థలో కల్తీమిర్చి విత్తనాలు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంతో గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు, సిబ్బంది, స్థానిక పట్టణ వ్యవసాయ శాఖ అధికారులు కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8.70 కిలోల కల్తీ/నకిలీ మిర్చి విత్తనాలు ప్యాకింగ్ చేయటానికి సిద్ధంగా ఉంచటాన్ని గుర్తించారు. ఆ విత్తనాలు ఎలా వచ్చాయనే దానిపై సంస్థ యజమానిని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదు. అయితే బెంగళూరు నుండి కిలో రూ.20 వేల చొప్పున విత్తనాలను సంస్థ యజమానే తెప్పించారని, వాటిని ఆకర్షణీయమైన ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి కిలో రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు అమ్ముతున్నారని అధికారులు తమ విచారణలో గుర్తించారు. లూజుగా విత్తనాలు కొని, ప్యాకింగ్ చేసి విక్రయించటం సీడ్స్ యాక్ట్ ప్రకారం విరుద్ధమంటూ సంస్థలో నిల్వ ఉంచిన రూ.2,61,000 విలువైన 8.70 కిలోల మిర్చి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జాయింట్ కలెక్టర్ కోర్టులో 6-ఎ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ అధికారి బి.అంజిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోమాల్‌తో జల్లులు

రోహిణీ తీవ్రతకు ముందు ఎండల నుండి ఉపశమనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రోమాల్ తుపాను ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, గుంటూరు, అమరావతి తదితర ప్రాంతాల్లో జల్లులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. శనివారం నుంచి రోహిణీ కార్తె ప్రవేశించింది. దీని ప్రభావం వల్ల సహజంగా ఉష్ణోగ్రతలు పెరిగి వేసవి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వడగాల్పులు అధికంగా ఉంటాయి.



అయితే తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఇటీవల వర్షాలతో పాటు తాజాగా ఏర్పడిన తుపాను ప్రభావం వల్ల వేసవి తీవ్రత తగ్గింది. ఉష్ణోగ్రత తగ్గినా ఉక్కపోత కొనసాగుతోంది.

గతేడాది మే చివరి వారంలో

2లో

పల్నాడు జిల్లాకు అదనపు అధికారులు

ఓట్ల లెక్కిపు నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక కేటాయింపులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పలు జిల్లాలకు అదనపు అధికారులను నియమిస్తూ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులిచ్చారు. వెంటనే వీరిని సంబంధిత జిల్లాల ఎస్‌పిల ఎదుట రిపోర్టు చేయాలని ఆదేశించారు. పల్నాడు జిల్లాకు నలుగురు ఎఎస్‌పిలు, నలుగురు డిఎస్‌పిలను కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్ఇబి అదనపు ఎస్‌పి పి.సోమశేఖర్‌రావు, మెరైన్ అదనపు ఎస్‌పి జి.బి.ఆర్. మధుసూదనరావు, అప్పా శిక్షణ సంస్థ అదనపు ఎస్‌పి డి.వి.రమణమూర్తి, సిఐడి డిఎస్‌పిలు డి.లక్ష్మణరావు, ఎ.లక్ష్మీనారాయణ, కాకినాడ జిల్లాలో అక్టోబస్ డీఎస్పీగా పని చేస్తున్న టి.నరసింహారావు, తూర్పు గోదావరి జిల్లాలో డీఎస్పీగా పని చేస్తున్న ఐ.తిరుపతయ్యను పల్నాడు జిల్లాకు కేటాయించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అధికారిని ఎంపిక చేసి, ఒకర్ని నరసరావుపేటలో రిజర్వులో ఉంచనున్నట్టు తెలిసింది. గుంటూరు జిల్లాకు సిఐడి అదనపు ఎస్‌పి సిహెచ్.జయరామరాజు, సిఐడి డిఎస్‌పిలు కె.వేణుగోపాల్, బి.లక్ష్మీనారాయణ, చిత్తూరు జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వర రావును కేటాయించారు.

లెక్కింపు కేంద్రాలకు పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్ బాక్సులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాలెట్ బాక్సలను శనివారం స్ట్రాంగ్ రూముకు చేర్చే ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ బాలాజీరావు, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పరిశీలించారు. ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించిన అనంతరం భద్రతా సిబ్బందితో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సులను నియోజకవర్గాల వారిగా స్ట్రాంగ్ రూములలో భద్రపరిచే విధానాన్ని పరిశీలించారు.



స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపును పర్యవేక్షిస్తున్న పల్నాడు కలెక్టర్, జెసి

550 సమస్యాత్మక గ్రామాలు

7 కంపెనీల బలగాలతో బందోబస్తు : పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లాలో 550 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఈ గ్రామాల్లో అదనపు బలగాలను మోహరించామని పల్నాడు జిల్లా ఎస్పీ మలిక గర్గ్ తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీసులతో ఎస్పీ శనివారం సమీక్షించారు. హింసాత్మక సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై పోలీసు అధికారులను వివరాలు అడిగారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టామని, జిల్లాకు 7 కంపెనీల సిఐఎస్ఎఫ్ బలగాలు వచ్చాయని చెప్పారు. ధ్రువపత్రాల్లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరమూ జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, కౌంటింగ్ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. సమీక్షలో డీఎస్పీ జి.గురునాథ్‌బాబు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





రవీంద్రబాబుకు నియామకపత్రం అందచేస్తున్న రాము తదితరులు

అప్సా స్టేట్ కో చైర్మన్‌గా మేకల రవీంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ఈనెల 23న జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) స్టేట్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర పాలక మండలి పి.రాము ద్వారా అధికారికంగా స్టేట్ కౌన్సిల్ కో- చైర్మన్‌గా మేకల రవీంద్ర బాబును ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. రామమోహన్‌రావు, పి.రాము, కోమారెడ్డి కిషోర్, వి.సుందరావు, కొమరగిరి, గుంటూరు అప్సా నాయకులు, చైర్మన్ చంద్రశేఖర్ ఎపిపిఎస్ఎ కో-చైర్మన్ మేకల రవీంద్ర బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మాట్లాడుతున్న గ్రంధాలయాధికారి

సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు సమాజంలో సైన్స్ పాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో సైన్స్ మానవులకు ఎలా ఉపయోగపడుతుందో తెలియజేశారు. పిల్లలు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు.తర్వాత పిల్లలకు గణిత శాస్త్ర చిట్కాలు గురించి వివరించారు. గణితం ప్రతి పిల్లవాడికి ఎంతో అవసరం అని, ఏ పనిచేయాలన్నా గణితం ఎంతో అవసరమని చెప్పారు.

ఫీజుల దోపిడిని అరికట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు వి.జాన్సన్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ లక్షల రూపాయాలు ఫీజులు వసూలు చేస్తు న్నా విద్యాశాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు ప్రవర్తిస్తున్నారని అన్నారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలకు తల్లిదండ్రుల నుండి వేల రూపాయాలు దోచుకుంటున్నారని, తమ పాఠ శాలలోనే పుస్తకాలు కొనాలని యాజ మాన్యాలు తల్లి దండ్రులను బెదిరింపులకు గురి చేస్తున్నాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే సెలవు రోజుల్లో పదో తరగతి విద్యా ర్థులకు బ్రిడ్జి కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే అటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నాసర్‌జీ, నగర కార్యదర్శి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ రంగానికి ఆహ్వానలక్ష్మి సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-తెనాలి

ప్రముఖ సాహితీవేత్త ఆహ్వానలక్ష్మి సాహితీ రంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. ఆహ్వానలక్ష్మి ప్రథమ వర్ధంతి సభ శనివారం స్థానిక కవిరాజాపార్కు సీనియర్ సిటిజన్స్ భవన్‌లో పట్టణానికి చెందిన భిన్న స్వరాలు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు జిఎస్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శివశంకర్ మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొని పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తిని అమ్మి ఆహ్వానం పత్రికను విలువలతో నడిపించిన ఘనత లక్ష్మికే దక్కుతుందన్నారు. ప్రముఖ కథా రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మిదేవి మాట్లాడుతూ ఆహ్వాన లక్ష్మి నాలుగేళ్ళపాటు సాహితీ మాసపత్రిక ఆహ్వానంను నడిపి, తన ఇంటిపేరు ఎఎస్ లక్ష్మికి బదులుగా ఆహ్వానం లక్ష్మిగా ప్రాచుర్యం పొందారని కొనియాడారు. ఆహ్వానం పత్రికలో అద్భుతమైన సంపాదకీయాలు రాయటంతో పాటు సాహితీవేత్తల పట్ల తనకున్న అభిమానానికి గుర్తుగా తన కుమారునికి ప్రముఖ కవి, చిత్రకారుడు సంజీవ్‌దేవ్ పేరు పెట్టారని ప్రశంసించారు. సభలో కథారచయిత కాట్రగడ్డ దయానంద్, కవితా సంపాదకులు బండ్ల మాధవరావు, ఆహ్వాన లక్ష్మి కుమారుడు సమయం రాజా సంజీవ్‌దేవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బిఎల్ నారాయణను సత్కరించారు. ఎం.విజయ భాస్కర్, ఎం.సత్యనారాయణ, బెన్నర్‌బాబుప పాల్గొన్నారు.



నారాయణను సత్కరిస్తున్న శివశంకర్, వీరలక్ష్మిదేవి తదితరులు

బాటంతా గుంతల మయం

మెల్లెంపూడి రోడ్డు వేసేది ఎన్నడో?

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రతి అడుగుకి గుంత. ఒక్కో గుంత చెరువును తలపించే విధంగా మారింది. ఇదే రోడ్డులో రైతాంగం తమ వ్యవసాయ పనులకు వెళుతుంటారు. గుండి మెడ, మెల్లెంపూడి భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం ఈ రోడ్డు వైపు నుండే మంగళగిరి, విజయవాడ వెళుతుంటారు. వర్షం పడిన ప్రతిసారి చెరువును తలపించే విధంగా గుంతలలో నీళ్ల చేరుతుంటాయి. తాడేపల్లి మండల పరిధిలో కే ఎల్ యు వైపు నుండి మెల్లంపూడి గుండిమెడ గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. రైతులు వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఈ రోడ్డు వైపు నుండి తమ పనుల కోసం రాకపోకలు సాగించే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే ఈ రోడ్డు వేస్తారని గుండి మేడ, మెల్లంపూడి గ్రామస్తులు, రైతులు ఎదురు చూశారు. రెండు పర్యాయాలు మంగళగిరి శాసనసభ సభ్యులుగా పనిచేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి, మండలంలో అన్ని డొంక రోడ్లు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. కానీ ఈ మెల్లంపూడి గుండి మెడ రోడ్డు మాత్రం నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ రోడ్డుపై ప్రయాణించే గ్రామస్తులు అవస్థలు మాత్రం వర్ణాణ తీతం. ఎప్పటికీ ఈ రోడ్డు నిర్మాణం చేపడతారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



అడుగడుగునా గుంతలు ఏర్పడిన మెల్లెంపూడి రోడ్డు

మైనర్ పిల్లలకు ఖరీదైన కార్లు బైకులు ఇచ్చే తల్లిదండ్రులకు

పూణే సంఘటన గుణపాఠం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరే కాదు దాదాపు అన్ని ప్రాంతాల్లో తల్లితండ్రులు తమ పిల్లల మీద ప్రేమతో వారికి ఏ విధమైన అనుమతులు,అర్హత లేకున్నా ఖరీదైన కార్లు, బైకులు ఇస్తున్నారని వారు ఆ వాహనాలు నడపటం చూసి మురిసిపోతున్నారని వీలుంటే తాము కూడా ఆ కార్లోనో, బైక్ ల మీదనో ప్రయాణిస్తుంటారని అటువంటి వారం దరికీ మహారాష్ట్రలోని పూణే సంఘటన గుణపాఠం కావాలని అవగాహన సంస్థ హెచ్చరిస్తుంది. పూణేలో ఒక ఖరీదైన లగ్జరీ కారును మద్యం మత్తులో 250 కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఒక మైనర్ బాలుడు చేసిన యాక్సిడెంట్ కి ఇద్దరు యువ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు దుర్మరణం పాలైనారని ఈ ఘోరాన్ని రోడ్డు ప్రమాదంగా కాక హత్యగా పేర్కొనాలని పూణే నగర ప్రజలు చేస్తున్న డిమాండ్ చాలా సముచితమని అవగాహన సంస్థ స్వాగతిస్తుంది.ఈ హత్యాకాండకు పిల్లవాడు ఒక్కడే బాధ్యుడు కాదని పిల్లవాడికి రెండు కోట్ల ఖరీదైన కారిచ్చి నచ్చినట్లు గా నడుపుకోమన్న తండ్రితో పాటు అనేకమంది వ్యక్తులు, వ్యవస్థలు ఈ పాపంలో భాగస్వాములేనని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. రెండు కుటుంబాలకు తీవ్ర విషాదాన్ని,భవిష్యత్తుని చీకటిమయం చేసిన ఈ సంఘటన మహారాష్ట్ర సమాజాన్ని కుదిపేసిందనీ దనబలం, నిర్లక్ష్యం సాటి మనుషుల ప్రాణాల పట్ల లెక్కలేనితనం ఈ ఘటనకు దారి తీసిందని అవగాహన సంస్థ నిరసిస్తుంది. స్థానిక ప్రజల నిరసనకు తలొగ్గి బాధ్యుడైన తండ్రిని, బార్ల యజమానులను అరెస్టు చేయటం జరిగినా కూడా స్థానికులు శాంతించడంలేదని అవగాహన సంస్థ తెలియజేస్తుంది.ఆ పిల్లవాడికి ఓ ఖరీదైన కారు ఇచ్చిన తండ్రిని కఠినంగా శిక్షించగలిగితే ఓ బలమైన హెచ్చరిక అవుతుందని ప్రకటించింది.

కాసుల కోసం కోతలు

(మొదటి పేజీ తరువాయి)

బంధువులను కంగారు పెట్టి అధికంగా సిజేరియన్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆయా ఆస్పత్రుల జాబితాను తయారు చేసి పంపాలని జిల్లా అధికారులను వైద్యారోగ్య శాఖ ఆదేశించింది. కొన్ని హాస్పిటల్స్ అధికంగా డబ్బులు సంపాదన కోసం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సాధారణంగా డెలివరీ అయ్యే సందార్భల్లోనూ ఆపరేషన్‌లు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి వెళ్లడం వల్ల పరిశీలన చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె వివరణిస్తూ జిల్లాలోని అన్ని హాస్పటల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 104 ఆస్పత్రులు సిజేరియన్లు చేస్తున్నాయని గుర్తించినట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఐదు హాస్పిటల్స్‌కు నోటీసులు జారీ చేశామన్నారు. ఇవి కాక మరో 99 హాస్పిటల్స్‌ను గుర్తించామని, వీటికీ త్వరలో నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకున్న వారు హాస్పటల్ వారికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఒకవేళ అలా జరిగితే వెంటనే తమకు సమాచార అందజేస్తే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్లు చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం షాపులో నగదు మాయం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్ లోని ప్రభుత్వ మద్యం షాపులో లక్షల రూపాయలు నగదు మాయమైంది. శుక్రవారం రాత్రి షాపు మూసివేసి షాప్ సూపర్వైజర్ గోపి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో షాపు షట్టర్ తాళాలు పగల గొట్టి షాపులోని లక్షన్నర రూపా యలు నగదు దొంగిలిచ్చి నట్లుగా సూపర్వైజర్ శనివారం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశా మని, సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లుగా పట్టణ పోలీసులు తెలిపారు.

'రోమాల్'తో జల్లులు

(మొదటి పేజీ తరువాయి)


ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు తగ్గాయి. అయితే శుక్రవారం మళ్లీ 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో 34 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది నైరుతీ రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. అంతేగాక గత వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల అడపాదడపా వర్షాలు నమోదు కావడం వల్ల ఎండల తీవ్రత తగ్గింది. వర్షం వల్ల వేడిగాలులు బాధ నుంచి ప్రజల ఉపశమనం పొందారు. గతేదాది ఇదే సమయంలో వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ ఏడాది వర్షాల ప్రభావం, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వేసవి తీవ్రత అంతగా లేకున్నా మంగళవారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతుందని, వేడిగాలులు కూడా వీస్తాయని వాతా వరణ శాఖ చెప్పిన 'వేడికబురు' ప్రజలను బెంబేలెత్తిసోంది.

గార్బేజ్ లిఫ్టింగ్ షెడ్ నిర్మాణం పునాదులకే పరిమితం

- ఏడాది క్రితం నిలిచిపోయిన నిర్మాణపు పనులు
- బిల్లుల చెల్లింపులు జరగని వైనం

ప్రజాశక్తి -పొన్నూరు

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు డివిసి కాలనీలో ప్రారంభించిన గార్బేజ్ లిఫ్టింగ్ సెంటర్ షెడ్ నిర్మాణం పనులు పునాదులకే



పిచ్చి, ముళ్ళ చెట్లతో నిండిపోయిన నిర్మాణపు షెడ్

పరిమితమయ్యాయి. గత ఏడాది క్రితం 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు 20 లక్షలతో ప్రారంభించిన గార్గేజ్ లిఫ్టింగ్ సెంటర్ షెడ్ నిర్మాణం పనులు అట కెక్కాయి. షెడ్డు నిర్మాణం పనులు ప్రారం భించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో పనులను నిలిపి వేసి నట్లు తెలిసింది. పట్టణంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను వేరు చేసేం దుకు ఈ షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. అయితే, డివిసి కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, నివాసాల పక్కన సెగ్రికేషన్ షెడ్డు నిర్మాణం చేయటం వల్ల చెత్త, వ్యర్థాలతో వచ్చే దుర్గంధంతో విద్యార్థులకు, స్థాని కులకు ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమా దం ఉందని వాపోతున్నారు. ఈ షెడ్డు పునా దులకే పరిమితమై నిర్మాణం నిలిపి వేయడం వల్ల పిచ్చి, ముళ్ళ చెట్లతో నిండిపోయి చిట్టడివిని తలపిస్తుంది. ఈ ప్రాంతం చెట్లతో మదుగు ఏర్పడి భయానక



7వ వార్డు డివిసి కాలనీలో నిర్మాణ దశలోనే ఆగిపోయిన గార్బేజ్ లిఫ్టింగ్ షెడ్

వాతావరణం కనిపిస్తుంది. ఇటీవల స్థాని కంగా అల్లరి మూకల మధ్య ఘర్షణ ఏర్పడి ఓ యువకుడిని హతమార్చి ఈ షెడ్డు ముళ్ళ చెట్లలో పడేసి వెళ్లారు. సాయంత్రం 6 గంటలు దాటితే ఈ ప్రాంత వాసులు భయాందోళనలతో ఉండే పరిస్థితి. షెడ్డు నిర్మాణపు పనులను మున్సి పల్ అధికారులు వెంటనే ప్రారంభిం చాలని, షెడ్డు వద్ద నైట్ వాచ్‌మెన్ ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముళ్ళ చెట్లు పొదలు తొలగించాలి: గృహిణి చిలక ఆదిలక్ష్మి



పునాదుల్లో ఆగిపోయిన గార్బేజ్ లిఫ్టింగ్ షెడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలి. పునాదుల్లో మొలిచిన పిచ్చి, ముళ్ళ చెట్లు పొదలు తొలగించాలి.

నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలి: మరియ కుమారి



చెత్త, వ్యర్థాలు సెగ్రికేషన్ చేసేందుకు ప్రారంభించిన షెడ్డు వద్ద నైట్ వాచ్మెన్ ను ఏర్పాటు చేయాలి. ఈ షెడ్డు వద్ద కాంతి వంతమైన వీధిలైట్లను వెంటనే ఏర్పాటు చేయాలి.

ఎస్సీ,ఎస్టీ కేసు విచారణ

ప్రజాశక్తి-ఈపూరు



కొండ్రముట్లలో విచారణ చేస్తున్న పోలీసులు

ఎస్సీ,ఎస్టీ కేసు విచారణలో భాగంగా నరస రావు పేట డిఎస్పి ఎం సుధాకర్ రావు మండ లంలోని కొండ్ర ముట్ల గ్రామాన్ని శని వారం సందర్శించారు. ఈ నెల 13వ తేదీన కొండ్రముట్ల పోలింగ్ బూత్ వద్ద గ్రామానికి చెందిన మక్కెన శౌరితో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గొడవపడి కులం పేరుతో దూషించి దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. డిఎస్పి ఎం.సుధాకర్‌రావు గ్రామంలో విచారణ చేపట్టి వివరాలను సేకరించారు. డిఎస్పీతో పాటు వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ రావు, ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

సచివాలయంలో కంప్యూటర్ చోరీ

ప్రజాశక్తి-కారంపూడి



కారంపూడి - 1 సచివాలయంలో దొం గలు పడ్డారు. స్థానిక బస్ స్టాండ్ సెంటర్ లోని సచివాల యంలో దుండ గులు కంప్యూటర్ ను ఎత్తుకెళ్లి నట్లు పంచా యతి సెక్రటరీ కాసిన్య నాయక్ తెలిపారు. శు క్రవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించిన తర్వాత యథా ప్రకారం తాళం వేసి వెళ్లడం జరిగిందని, తిరిగి మర్నాడు ఉదయం కార్యాలయానికి సిబ్బంది వచ్చే సరికి తాళం తీసి చూడగా కంప్యూటర్ చోరీకి గురైనట్లు గుర్తించారని చెప్పారు. ఈ సమాచారాన్ని వెంటనే సిబ్బంది సెక్రటరీకి తెలియజేశా రన్నారు. సమీపంలోని సిపి ఫుటేజ్ లను పంచాయతీ కార్యదర్శి పరిశీలిస్తున్నట్లు సమాచారం. వాస్తవంగా కం ప్యూటర్ ను దొంగలు ఎత్తుకెల్లారా లేక ఇంటి దొంగలే మాయం చేసారా అనే సందేహం ఈ సిబ్బందిలో నెలకొని ఉంది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో కూడా పంచాయతీ అధికారులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వికలాంగ బాల బాలికల వసతి గృహాల్లో ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి నరసరావుపేట ప్రకాష్ నగర్, నకరికల్లు మండలం చల్లగుండ్ల లోని వసతి గహాలలో ఉచిత ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల,వయోవద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి సిహెచ్ సువార్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు.. శారీరక, దృష్టి లోపం కలిగి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకసారి 1వ తరగతిలో ప్రవేశం పొందినవారు, వారి వసతి కోసం వేర్వేరు వెళ్లాల్సిన అవసరం లేకుండా 10వ తరగతి వరకు వారి చదువు కొనసాగించుకోవచ్చని తెలిపారు. ఈ వసతి గృహంలో విద్యార్థులకు దుస్తులు, భోజనం, వసతి, నోట్ పుస్తకములు, బెడ్డింగ్ మెటీరియల్, సౌందర్య పోషణ ఖర్చులు, ఉచితంగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు (బాల బాలికలు) శారీరక అంగవైకల్యము, పాక్షిక అంధత్వ లోపము కలిగి ప్రభుత్వ వైద్యశాల నుండి ధవీకరణపత్రము పొందిన బాల బాలికలు ఈ సదుపాయన్ని వినియోగించుకోవాలని కోరారు. అడ్మిషన్ కోరే వారు ఇతర వివరాల కోసం ఎస్. సతీష్ కుమార్, వార్డెన్ గ్రేడ్ - 1, ప్రభుత్వ విబ్బిన ప్రతిభావంతుల అంధుల వసతి గహం, నరస రావుపేట, ప్రభుత్వ విబ్బిన ప్రతిభావంతుల బాల బాలికల వసతి గృహం, చల్లగుండ్ల, నకరికల్లు మండలం వారి ఫోన్ నెంబర్ 9849347904లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పలు గ్రామాల పరి ధిలో ఆదివారం ఏర్పడు తుందని మండల విద్యుత్ శాఖ అధికారి నాగరాజ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నూతన 33 కె. వి లైన్ ఏర్పాటు, లైన్ లో చెట్లు తొలగించటానికి లైన్ క్లియర్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధి లోని మెడికొండూరు, సిరిపురం, పాలడుగు, కొర్రపాడు, జంగుం గుంట్ల పాలెం, పొట్లపాడు,మందపాడు, సరిపూడి, వెలవర్తిపాడు గుండ్లపాలెం , విశదల గ్రామాల లో ఉదయం 7 నుండి ఉదయం 11 వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



పొన్నూరులో రూట్ మార్చ్ నిర్వహిస్తున్న అర్బన్ పోలీసులు

ప్రజాశక్తి -పొన్నూరు

జూన్ 4 వ తేదీన రాష్ట్రంలో వెలువడే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పొన్నూరు పట్టణంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగుకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వ్యక్తులను ఉపేక్షించేది లేదని అర్బన్ సిఐ పి. భాస్కర్ హెచ్చరించారు. అర్బన్ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం పట్టణంలో రూట్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలో అల్లర్లకు పాల్పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా పొన్నూరులోని తెలగపాలెం, డివిసి కాలనీ ప్రాంతాలలో పోలీస్ స్టేషన్ సిబ్బంది అయా ప్రాంతాలలో పర్యటించారు. ప్రజలు అవాంఛ నీయ సంఘటనలు, ఘర్షణలకు పాల్పడకుండా అవ గాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ మాట్లాడుతూ కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే ధోరణులకు పాల్పడితే అలాంటి వారిని గుర్తించి చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు .పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొత్త వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని కోరారు. సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. పట్టణ ఎస్సైలు రాజ్‌కుమార్, బాబురావు, ఎఎస్ఐ సుభాని పాల్గొన్నారు.

రాజకీయ ఘర్షణలతో కేసుల్లో ఇరుక్కోవద్దు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల ఫలితాలు రానున్న వేళ గ్రామాల్లో రాజకీయ కక్షలు, ఉద్రేకాలతో దాడులకు పాల్పడే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జె.బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని మురికిపూడిలో శని వారం చిలకలూ రిపేట రూరల్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిం చారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ రాజకీయ వాగ్వాదాలు, ఘర్షణల కారణంగా కేసుల్లో ఇరుక్కుని జీవి తాలను పాడు చేసు కోవద్దని కోరారు. సుమా రుగా వందకు పైగా లైసెన్స్,రి కార్డులు లేని వాహనాలను సైకిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించినట్లు చెప్పారు.



మురికిపూడిలో కార్డన్ సెర్చ్ లోచిలకలూరిపేట రూరల్ పోలీసులు

ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -పొన్నూరు



భారత సాంస్కృతిక రంగంలో విప్లవాత్మక మార్పు లకు పునాది వేసింది ఐ పి టి ఏ (ఇండి యన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్) దాని అను బంధంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆవిర్భవించిందని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామా రావు అన్నారు.ఇప్టా ఆవిర్భావ దినోత్సవంగా స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం శని వారం నిర్వ హించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత ప్రజానాట్యమండలి జెండాను అరేటి రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జం పని గోవిందరాజు, కళాకారులు రాజేంద్ర, శ్రీనివాస్,చైతన్య, జి.ఏడు కొండలు, నర సింహారావు, వలీ తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

విత్తనాలను అధిక ధరలకు అమ్మితే ఫోన్ చేయండి : ఏవో

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విత్తనాలను ఎంఆర్‌పి ధరలకు మించి విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు షాపు లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీలత అన్నారు. పట్టణంలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, సరుకు నిల్వల వివరాలు పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలనే విక్రయించాలన్నారు. రైతులు కూడా తాము విత్తనాలు కొనుగోలు చేసిన సందర్భంలో రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొను గోలు చేసే రైతులు లాట్ నంబరు, రశీదులు భద్రపరచుకోవాలన్నారు. అధిక ధరలకు ఎవరైనా విక్రయిస్తే 8331056944, 8331056941 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం కింద కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇన్‌ఛార్జి) ఎస్.శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలోని విత్తన దుకాణాల్లో ఆయన శనివారం తనిఖీలు చేపట్టారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల ముందు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రతి రోజూ విత్తన నిల్వలు వివరాలు నమోదు చేయాలని విత్తన డీలర్లను ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులక ుసూచించారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, అనుమతులు లేని విత్తనాలు అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో సోదాలు చేశారు. షాపు లేదా డీలర్ పేరు మీద బిల్లు లేకుండా విత్తనాలు వస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

స్కాలర్‌షిప్ మంజూరునకు నేడు అర్హత పరీక్ష

ప్రజాశక్తి - వినుకొండ

పేరెంట్ ఓరియంటేషన్, స్కాలర్షిప్ పరీక్ష ఆదివారం నిర్వహిస్తామని ఐఎఎస్, ఐఐటి, నీట్ అకాడమీ చైర్మన్ డాక్టర్ పివి లక్ష్మయ్య శనివారం తెలిపారు. 6వ తరగతి నుండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ స్కాలర్షిప్ పరీక్షలకు హాజరుకావొచ్చని, ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మార్కాపురం రోడ్డులోని భ్రమర టౌన్షిప్ నందు తన అకాడమీ హాల్లో పరీక్ష ఉంటుందని చెప్పారు. అడ్మిషన్ నిమిత్తం 8500218036 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జైలుపాలు కావొద్దు.. కుటుంబాన్ని వీధిపాలు చేయొద్దు..



ప్రజాశక్తి - రెంటచింతల

అనవసర విషయాల్లో తలదూర్చి గొడవలు పెట్టుకోవద్దని, జైలుపాలై కుటుంబాలను వీధులపాలు చేసుకోవద్దని ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు సూచించారు. ప్రశాంతంగా బతకడం నేర్చుకోవాలని ప్రజలను కోరారు. మండల కేంద్రమైన రెంటచింతల, ఎర్రబాలెం, మిట్టగుడిపాడు గ్రామాల్లో శనివారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బిడ్డలను ప్రయోజకులు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. క్షణికావేశంలో చేసే పనులకు కుటుంబాలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈనెల 12, 13 తేదీల్లో పోలింగ్ సందర్భంగా ఆవాంఛనీయ ఘటనలు మళ్లీ తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పోలీసు కవాతు చేయడంతోపాటు పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిఐ శివాజీ, ఎస్ఐ ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని 11, 22 వార్డుల్లో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లరి నేపథ్యంలో మాచర్లలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పట్టణ ఎస్ఐ బి.గోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తిరుగుతున్నాయని, వీటిని సీజ్ చేసి కోర్టుకు అప్పజెబుతామని ఎస్ఐ అన్నారు. వాహనదారులు పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి - దుర్గి

మండలంలోని ధర్మవరంలో ఎస్ఐ కోటయ్యతో పాటు కేంద్ర బలగాల డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. సుమారు 70 మంది పోలీసులు



ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో తనిఖీలు చేశారు. ఆనుమానాస్పద ఇళ్లు, పశువుల పాకలు, గడ్డి వాములు, దిబ్బల్లో బాంబులు, ఇతర మారణాయుధాలేమైనా ఉన్నాయా? అని తనిఖీ చేశారు. ప్రధాన వీధుల్లో కవాతు చేశారు. సరైన ధ్రువపత్రాల్లేని 15 బైకులను సీజ్ చేశారు. పత్రాలు చూపిన వారి వాహనాలను అప్పగిస్తామని పోలీసులు చెప్పారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గొడవలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్సై వెంకట్రావు అన్నారు. ఎవరూ వివాదాల జోలికెళ్లొద్దని స్థానికులకు సూచించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కట్టుదిట్టమైన భద్రత మధ్య పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఎన్నికల అధికారులు కౌంటింగ్ కేంద్రానికి శనివారం తరలించారు. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్న ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేశారు. మే 5,6,7,8, తేదీల్లో సత్తెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెలిసిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ బాక్సులను తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఇప్పటి వరకూ భద్రపరిచారు. వచ్చేనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య అభ్యర్థుల



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న అధికారులు

సమక్షంలో ప్రత్యేక వాహనంలో నరసరావుపేట మండలం కాకాని సమీపంలోని జేఎన్టీయూకు తరలించారు. తరలించారు. అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో వీటిని భద్రపరిచారు.

స్త్రీనిధి రుణాల్లో అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - అచ్చంపేట

భవిత మండల సమైక్య ద్వారా డ్వాక్రా సంఘాలకు రెండేళ్లుగా స్త్రీ నిధి రుణాలు మంజూరు కావడం లేదు. ఈ ఏడాదైనా మంజూరఅవుతాయా? లేదా? అనేది ప్రశ్నార్థకమైంది. మండల కేంద్రమైన అచ్చంపేటలోని వెలుగు కార్యాలయంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో పీడీ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా స్త్రీ నిధి ఏజీఎం చిన్న బుల్లయ్య శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు రూ.3 కోట్ల శ్రీనిధి రుణాలను 42 గ్రామ సమైక్య సంఘాల ద్వారా ఇచ్చామన్నారు. 2023-24లో రూ.2.09 కోట్లు, రూ.1.15 కోట్లు 35 గ్రామ సమైక్య సంఘాల ద్వారా జమ కావలసి ఉందన్నారు. రెండు నెలలుగా రూ.22 లక్షల జమ కాగా రూ.93 లక్షలు ఎన్‌పిఎ, 83 లక్షలు ఓడి ఉందని వివరించారు. అందులో పెదపాలెం క్లస్టర్‌లో రూ.38.70 లక్షలు, మాదిపాడు క్లస్టర్లో రూ.34 లక్షలు, తాళ్లచెరువు కస్టర్లో రూ.3.89 లక్షలు, అచ్చంపేట క్లస్టర్లో రూ.17.70 లక్షలు రికవరీ కావాల్సి ఉందన్నారు. శ్రీనిధి రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలు ప్రతినెలా వాటిని సంఘానికి చెల్లించే క్రమంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఆ నగదును గ్రామ సంఘం



మాట్లాడుతున్న ఎజిఎం చిన్న బుల్లయ్య

ఖాతాలో జమ చేసి ఆన్‌లైన్‌లో సిసి శ్రీనిధికి కంప్యూటర్లో నమోదు చేయాలని చెప్పారు.

ఇదిలా ఉండగా గ్రామ సంఘాలు నగదు జమ చేయకపోవడం కొన్ని సంఘాలు నగదును క్లస్టర్‌కు చేతికి ఇవ్వటం ద్వారా రికవరీలు చూపిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇది వెలుగులోకి రావడంతో విచారణతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించినా ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావి స్తోంది. తాజాగా నెల రోజుల్లో రికవరీ చేసి స్త్రీ నిధి రుణాలి స్తామనీ చెబుతున్నా వాస్తవానికి 90 శాతం రికవరీ అయి తేనే రుణాలు మంజూరవుతాయి. కానీ శ్రీనిధి అధికారులు స్పష్టంగా రుణాలు ఇస్తామని చెప్పలేకపోతున్నారు. రుణాలిస్తే ఈసారి డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాల్లో జమ చేసి పేటీఎం ద్వారా డైరెక్ట్‌గా స్త్రీ నిధికి జమయ్యేలా కొత్త పద్ధతులు ప్రవేశపెడుతున్నట్లు ఎజిఎం తెలిపారు.



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలుతున్న కలప

కాలుతున్న చెట్లు.. తరలుతున్న కలప

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నియోజకవర్గంలోని ఆర్ అండ్ అండ్ బి రోడ్ల వెంట ఉన్న పచ్చని చెట్లు తగులబడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి... చెట్లను సంరక్షించాలి.. అనే నినాదాలు ప్రచారా ఆర్భాటాలుగానే మిగులుతున్నాయి. ఇదిలా ఉండగా చెట్లను నరికి కలపను రాత్రివేళల్లో పదుల సంఖ్యలో తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని, అక్రమ సొమ్ములో అధికారులకూ వాటాలు అందుతున్న కారణంగానే చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.





అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సరిగ్గా పదిరోజుల సమయమే ఉంది. ఎన్నికల నేపథ్యంలో తెనాలితో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈసి ఆదేశాల మేరకు పోలీసులు కూడా కౌంటింగ్ సదర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చేనెల నాలుగున కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో పోలీసులు తీసుకుంటున్న జాగ్రత్తలిలా ఉన్నాయి.

- కౌంటింగ్ సందర్భంగా అప్రమత్తమైన పోలీసులు
- తరచుగా వాహనాల తనిఖీలు
- కొత్త వ్యక్తుల సంచారంపై నిఘా
- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్
- ట్రబుల్ మాంగర్స్ బైండోవర్

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి సబ్ డివిజన్ పరిధిలో తెనాలి నియోజక వర్గంలో ఎన్నడూ లేని పరిణామాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పోలింగ్ రోజున ఐతానగర్ ఎర్రబడిలో ఏర్పాటు చేసిన 15వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి నేరుగా పోలింగ్ బూత్‌లోకి వెళ్ళడం, అప్పటికే క్యూలో వేచిఉన్న ఓటరు గొట్టిముక్కల సుధాకర్ ఎమ్మెల్యేను ప్రశ్నించటం, దానిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే అతనిపై చేయి చేసుకోవటం, అతను కూడా తిరిగి ఎమ్మెల్యేను కొట్టడం అంతా క్షణాల్లో జరిగిన సంగతి తెలిసిందే. అంతకు మించిన ఘటనలు పల్నాడు జిల్లా మాచర్చలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవిఎంను పగులగొట్టడం, నరసరావుపేట, గురజాలలో అల్లర్లు వంటి ఘటనలు ఎన్నికల తరువాత తీవ్ర దుమారం రేపాయి. ప్రధాన రాజకీయ పార్టీల మద్య ఆరోపణలు, ప్రత్యారోపణలకు కారణమయ్యాయి. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలకు తావులేకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో ఒన్‌టౌన్ సిఐ దశరధరామారావు, టూటౌన్ సిఐ సుధాకర్ సారధ్యంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో స్థానిక పోలీస్ యంత్రాంగంతో పాటు సిఆర్‌పిఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటిం టికి తిరిగి కొత్త వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు. అలాగే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే ఎలాంటి పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు కూడా. ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. వాహనాల్లో మాత్రమే పెట్రోలు, డిజిల్ కొట్టాలని విడిగా క్యాన్లు, బాటిళ్ళలో కొట్టవద్దని పెట్రోల్ బంకు నిర్వాహకులు నోటీసులు జారీ చేశారు. అలాగే బాణా సంచా విక్రయించ కూడదని షాపులకు కూడా నోటీసులు అందించారు. ప్రతి ప్రాంతంలో స్థానికులతో కలిసి పోలీసులు మాట్లాడు తున్నారు. ఎన్నికల కౌంటింగ్ వేళ పాటించాల్సిన జాగ్రత్త లను వివరిస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని, పార్టీలను గాని, వ్యక్తులను గాని కించపరచి భావోద్వేగాలను రెచ్చగొట్టే చర్యలు తగవని హెచ్చరిస్తున్నారు. విజయోత్స వాలకు సంబంధించి ఊరేగింపులు, బాణా సంచా కాల్చటం, డిజె సౌండ్ సిస్టమ్ వంటి వాటికి అనుమతు ల్లేవని చెబుతున్నారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తు న్నారు. సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి, బైండోవర్ చేస్తున్నారు. మొత్తం మీద కౌంటింగ్ రోజున ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ముందస్తు చర్యల్లో పోలీసులు నిమగ్నమయ్యారు.


చినరావూరు ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న సిఐ దశరధరామారావు


టూటౌన్ పరిధిలో వాహనాల తనిఖీలో సిఐ సుధాకర్

అల్లర్ల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం



ఎం.రమేష్, డీఎస్పీ, తెనాలి.

సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసు కుంటున్నాం. ఇప్పటికే ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి కౌన్సి లింగ్ నిర్వహించి, బైండోవర్ చేశాం. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాం. కౌంటింగ్ సందర్భంగా ప్రజలు ఎలాంటి భావో ద్వేగాలకు గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ఫ్లాగ్ మార్చ్ నిర్వహించటం, వాహనాల తనిఖీలు తరచుగా జరుగుతున్నాయి. విజయో త్సవాలకు, బాణా సంచా కాల్చేందుకు అనుమతి లేదని ప్రజలకు హెచ్చరిస్తున్నాం. నిబం ధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవు. అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు.

రౌడీషీటర్లపై పోలీసులు నిఘా

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 13వ తేదీన పల్నాడు జిల్లాలో పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనాలు, దాడుల నేపథ్యంలో మంగళగిరి పరిసర ప్రాంతాల్లో రౌడీ షీటర్ల పై పోలీసులు నిఘా పెంచారు. పల్నాడు ప్రాంతంలో అరెస్టులు జరగడంతో తల దాచుకోవడానికి మంగళగిరి పరిసర ప్రాంతాలకు వస్తారేమోనని అనుమానంతో మంగళగిరి డిఎస్పీ పరిధిలో పోలీసులు అనునిత్యం తనిఖీలు చేస్తున్నారు. మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ఉన్న అపార్ట్మెంట్లలో ఉండే వారిపై, వచ్చే వారిపై, లాడ్జింగ్‌లపై నిఘా పెంచారు. మంగళగిరి పట్టణంలో, గ్రామాల్లో ఉన్న రౌడీ షీటర్లకు పోలీసులు పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. కౌంటింగ్ రోజు ముందుగానే, ఆ తర్వాత గాని ఏమైనా జరిగితే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. మంగళగిరి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న టపాస్ కాయల మందు గుండు సామగ్రి అమ్మే యజమానులకు నోటీసులు కూడా జారీ చేయడం జరిగింది. బైపాస్ రోడ్ లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. మంగళగిరి పట్టణంలో పోలీస్ వాహనాలు నిత్యం గస్తీ తిరుగుతూనే ఉన్నాయి.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



రౌడీషీటర్ కదలికలపై నిఘా ఎప్పటి కప్పుడు ఉంటుందనే విషయం పరిగణలోకి ఉంచుకుని వారి దైనందిక ప్రక్రియ కొనసాగించాలని వారి ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని మంగళ ౕగిరి రూరల్ ఎస్ఐ జె క్రాంతికిరణ్ కోరారు. రాబోయే రోజుల్లో మంగళగిరి రూరల్ పరిధిలో ప్రశాంత వాతా వరణం ఉండాలని ఎవరైనా దాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. కౌంటింగ్ ముందు రోజు కాని కౌంటింగ్ పూర్తైన తరువాత రోజు కాని ఎక్కడైనా రౌడీషీటర్ కదలికలు కనిపిస్తే సహించేది లేదని తెలిపారు.

సమ్మర్ క్యాంప్‌లతో చిన్నారుల్లో జోష్

ప్రజాశక్తి-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో స్థానిక బైపాస్‌రోడ్డు అమరావతి ఐకాన్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ పిల్లల్లో ఉత్సాహం నింపుతుంది. ఏప్రిల్ 25వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు, మే 15 నుంచి 31 వరకు రెండు దఫాలుగా సమ్మర్ క్యాంప్ జరుగుతుంది. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలుగా విభజించి పిల్లలకు ఇష్టమైన వాటిలో శిక్షణ ఇస్తున్నారు. వివిధ అపార్టుమెంట్ల నుంచి పిల్లలను తల్లిదండ్రులు ఇష్టంగా ఈ సమ్మర్ క్యాంపుకు పంపుతున్నారు. పిల్లలు కూడా తమకు నచ్చిన అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం తరుపున ఈ శిక్షణ జరుగుతున్నా కార్యక్రమం విజయవంతానికి అపార్టుమెంట్‌లోని మంచి ఆలోచనలు కలిగిన మహిళలు ముందుకు వచ్చి నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మూడు గంటల పాటు సులభంగా లెక్కలు నేర్చుకోవడం, డ్యాన్స్ తదితర వాటిల్లో శిక్షణ జరుగుతుంది. ఏప్రిల్ 25 నుంచి మే 5 వరకు జరిగిన శిక్షణలో బెస్ట్ ఫ్రమ్ హోమ్, నిత్య జీవితంలో సైన్స్, పాటలు నేర్పించడం, చిత్రలేఖనం, కథలు రాయించడం, చేతి రాత, మ్యాజిక్, లెక్కల్లో ప్రాథమిక సూత్రాలు, కథలు చెప్పడం, సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవడం తదితర వాటిల్లో రోజుకు ఒకటి చొప్పున స్వాతిపూర్ణిమ, శివనాగేశ్వరరావు, జగన్, ఆర్.ఆదినారా యణ, లెనిన్‌బాబు, శాంతిశ్రీ, సునీల్ కుమార్, బాలకృష్ణా రావు తదితర నిష్ణాతులు శిక్షణ ఇచ్చారు. మే 15 నుంచి 31 వరకు జరిగిన శిక్షణలో లెక్కలు, డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. అపార్టుమెంట్ వాసులు కల్యాణి, సంధ్య, రమ ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. పిల్లలు ఎంతగా వీటిలో లీనమయ్యారంటే ఇళ్లకు వెళ్లి తమ కుటుంబ సభ్యుల ముందు తాము నేర్చుకున్న డ్యాన్స్ ప్రదర్శిస్తున్నారు. జూన్ రెండో తేదీన ఈ శిక్షణలో పాల్గొన్న పిల్లలందరికీ సర్టిఫికెట్లు, షీల్డులతో పాటు పెద్దఎత్తున సభ నిర్వహించడానికి నిర్వాహకులు కృషి చేస్తున్నారు.









చిరుజల్లులతో పైర్లు కళకళ


చిరుజల్లులతో కళకళలాడుతున్న ఆకుకూరలు, అరటి తోట

ప్రజాశక్తి-దుగ్గిరాల



బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుపాను ప్రభావం వలన శనివారం ఉదయం నుండి మండల వ్యాప్తంగా వర్షం ప్రారంభమై నది. ఎండకు తట్టుకున్న పంటలు వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి ఊపిరిపీల్చుకున్నాయి. శనివారం ఉదయం నుండి ప్రారంభమైన వర్ష ప్రభావం చల్లని వాతావరణానికి మెట్ట పంటలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా ఆకుకూరలు అరటి బెండ, చేమ ప్రస్తుతం సాగులో ఉన్నాయి. చిలువూరు పరిసర ప్రాంతాలలో నిమ్మ సపోటా తోటలు సాగు చేపడుతున్నాయి. .రైతులు నీటి తడుపులు క్రమం తప్పకుండా ఇస్తున్నప్పటికీ ప్రకతి వర్షానికి చెట్లు నేల రెండు తడుస్తాయి దీనితో పంట పొలాలు పచ్చని తివాచీ పరిచినట్లు కనువిందు చేస్తున్నాయి. రాబోయే ఖరీఫ్‌కు ఈ వర్షం స్వాగతం పలికినట్లు అయినది.



ప్రజాశక్తి మంగళగిరి

పట్నంలో శనివారం ఉదయం నుండే వర్షం జల్లులు మొదలయ్యాయి. బంగా ళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల ఈ వర్షం కురిసింది. రోజుల్ల జల్లులు పడడం తో మెయిన్ బజార్, మిద్ది సెంటర్ వివిధ ప్రాంతాల్లో తోపుడుబండ్లపై చిరు వ్యాపారం చేసుకునే వారికి ఉపాధి కోల్పోయారు. చిన్నపాటి వర్షానికి రోడ్లు చిత్తడి చిత్తడిగా మారిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. పైపులైను వేసేటప్పుడు రోడ్లు పగలగొట్టారు గాని, రోడ్లు వేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారు.



వేణుగోపాలసోమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం బైపాస్ రోడ్డు సమీపంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ జిల్లా అధ్యక్షులు ఇ.డేవిడ్‌రాజు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు ఎం.వెంకటరామిరెడ్డి, మంగళగిరి నియోజకవర్గ జెసిఎస్ అధ్యక్షులు ఎం.వివేకానందరెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, ఎం.ప్రకాష్, బి.అనిల్, బి.దాస్, ఎస్.పార్వతి, రుక్మాంగరెడ్డి, టి.వికాస్, కె.ఉదయరాజు, మధు, కిషోర్, పెదగాలయ్య, మాజీ కౌన్సిలర్లు ఎండి గోరెబాబు, వి.లక్ష్మీరోజా, డి.విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు


రికార్డులను పరిశీలిస్తున్న సుబ్బరత్నమ్మ

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ళ గ్రామంలో గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి వంక దారి సుబ్బ రత్నమ్మ శని వారం తనిఖీ చేశారు. గ్రంథా లయంలోని రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీలలో భాగంగా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం గ్రంధాలయ నిర్వాహకు రాలు నాగలక్ష్మి కు సూచనలు చేశారు.

'రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి'

ప్రజాశక్తి-వినుకొండ

ఒకరి భూమి మరొకరికి ఆన్లైన్ వెబ్ ల్యాండ్ లో నమోదు చేసి అక్రమాలకు పాల్పడిన వినుకొండ రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిడిఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. వినుకొండ మండలం విఠం రాజు పల్లి గ్రామానికి చెందిన యాదాల వెంకటేశ్వర్లు కు బ్రాహ్మణపల్లి రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 256- బి1లో 45 సెంట్లు భూమి ఉండగా ప్రస్తుత భూ సర్వేలో ఎల్ పి నెంబర్ 1478 గా 40 సెంట్లు మాత్రమే ఆన్లైన్ వెబ్ ల్యాండ్ రికార్డులో ఎక్కించారని, ఆ భూమికి పక్కనే ఉన్న సింగంశెట్టి నాగమణి సర్వేనెంబర్ 256-1 ఏ లో 1.51 ఎకరాలు ఉండగా, భూ సర్వేలో ఎల్పీ నెంబర్ 1621 7 సెంట్లు అదనంగా కలిపి భూమి లేకపోయినా రెవెన్యూ అధికారులు కుమ్మక్కై 1.58 ఎకరాల భూమిక వెబ్లాంలో నమోదు చేసి యాదాల వెంకటేశ్వర్లు భూమి ఐదు సెంట్లు నాగమణి పేరుపై అక్రమంగా ఎక్కించారని, భూ సర్వే పేరుతో రెవెన్యూ అధికారులు వారి ఇష్టానుసారంగా రికార్డులను తారుమారు చేసి భూయజ మానులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన నేటికీ పరిష్కరించకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. వెంటనే రెవెన్యూ రికార్డులను పరిశీలించి అధికారులు బాదిత పేద రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించని పక్షంలో ప్రజాస ఘాలు ఆందోళన కార్యక్రమాలు చేపడతాయని హెచ్చ రించారు.



యువత.. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని విజయపురిసౌత్ టిడిపి అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం విజయపురిసౌత్ లోని జింఖానా గ్రౌండ్ లో చింతలతండా మాజీ సర్పంచ్ కేతావత్ సూర్య నాయక్ కుమారుడు హరి నాయక్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నీ లో పాల్గొన్న యువకులను ఆయన అభినందించారు. టోర్నీ ఫైనల్లో జమ్మిగడ్డ తండా,మధ్య తండా జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన మధ్య తండా జట్టు 6 ఓవర్లకు 40 పరుగులు చేసి అలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన జమ్మిగడ్డ తండా జట్టు 7 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. టోర్నీ విజేత జమ్మిగడ్డ తండా జట్టుకు రూ.5,166 ఫైజ్ మనీ ని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సీతా నాయక్, ఆర్గనైజర్ హేమంత్ నాయక్,రంగా, నాగయ్య పాల్గొన్నారు.

వినుకొండలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పేరుకుపోయిన చెత్త చెదారం
- ఆక్రమణలు తొలగించారు.. డ్రైనేజీ పనులు మరిచారు
- డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతం

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్త వ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువల్లో మురుగునీటి పారుదల లేక దుర్గంధం వెదజల్లుతుంది. కాలువల్లో, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురుగునీరు నిల్వ చేరి కుంటలను తలపిస్తున్నాయి.


మార్కాపురం రోడ్డులోని అంబికానగర్ వద్ద వ్యర్థాలతో నిండిన డ్రైనేజ్ కాల్వ

డ్రైనేజీ కాలువలో పారుదల లేక మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. వినుకొండ పట్టణంలో గత ఏడాది డ్రైనేజీ కాలువల నిర్మాణానికి మున్సిపాలిటీ కోట్ల రూపాయలు ఖర్చు చేసింది కానీ డ్రైనేజీ నిర్మాణం సమయంలో ఇంజనీరింగ్ విభాగం ఎత్తుపల్లాలు అంచనాలు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అడ్డగోలుగా నిర్మించడం వలన మురుగునీరు కాలువలోని నిలవలు ఉండిపోతున్నాయి. స్థానిక నరసరావుపేట రోడ్డులోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద నుండి


14వ వార్డులో వ్యర్థాలతో నిండిన కాల్వను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు

శివయ్య స్తూపం వరకు లక్షల రూపాయల వ్యయంతో గత ఏడాది కాలువ నిర్మాణం చేశారు. పాలకుల అధికారులు స్వార్థంతో అడ్డగోలుగా నిర్మించడం వలన కాలువలో మురుగునీరు పారుదల లేక ఎక్కడిది అక్కడే నిలిచిపోయింది. డ్రైనేజీ కాలువ నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. నరసరావుపేట రోడ్డు లోని చెక్క వాగు వరకు ప్రవహిస్తున్న ప్రధాన డ్రైనేజీకి శివయస్థాపం నుండి పంచాయతీరాజ్ కార్యాలయం వద్దకు నిర్మించిన డ్రైనేజీ అనుసంధానం చేయాల్సి ఉంది. కానీ ఆ విధంగా డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయం వద్ద మురికి కోపంగా మారింది. మార్కాపురం రోడ్డు లోని జాతీయ రహదారికి ఇరువైపులా గత ఏడాది మున్సిపాలిటీ ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం చేపట్టింది. దీనితో ఇరువైపులా డ్రైనేజీ కాలువలు దెబ్బతిని మురుగునీటి పారుదల లేక ఎక్కడికక్కడ స్తంభించింది. స్థానిక చెక్పోస్ట్ వద్ద నుండి ఇసుక వాగు ప్రధాన కాలువ వరకు డ్రైనేజీ నిర్మాణం లేదు. కానీ గతంలో రోడ్డుకు ఇరువైపులా దోనెలు ద్వారా



మురుగునీటి ప్రవహిస్తూ ఇసుక వాగు ప్రధాన కాలువకు చేరి అక్కడ నుండి ముట్లకుంట చెరువుకు చేరుతుంది. కానీ ఆక్రమణల తొలగింపు పేరుతో మున్సిపల్ అధి కారులు ఇటీవల రోడ్డు ఇరువైపులా దోనెలు ధ్వంసం చేశారు. నెలలు గడు స్తున్న డ్రైనేజీ నిర్మించక పోవడంతో ఎగువ నుండి వస్తున్న మురుగునీరు రోడ్లకు ఇరువైపులా చేరి తటాకాలను తలపిస్తూ దుర్గంధం వెదజల్లుతుంది. వర్షం కురిస్తే మురుగు నీరు అంతా జాతీయ రహ దారిపై ప్రవహిస్తుంది. అధికారులు పాలకులు చేసిన నిర్లక్ష్యం వలన కోట్ల రూపాయల లో చేసే జాతీయ రహదారి దెబ్బ తింటుంది. అలాగే ఆర్టీసీ బస్టాండ్, కారంపూడి రోడ్డు, వెల్లటూరు రోడ్డు, ఏనుగుపాలెం రోడ్డు, సురేష్ మహల్ రోడ్


పంచాయతిరాజ్ కార్యాలయం వద్ద డ్రైనేజ్ కాలువ

తదితర ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపు చేసిన మున్సిపల్ అధికారులు డ్రైనేజీ మరమ్మత్తులు చేయటం మరిచారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడికక్కడ స్తంభించి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుంది. అంతేకాకుండా పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. కాలువల్లో సక్రమంగా కూడికలు తీయకపోవడం, వాకింగ్ లాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో మురుగునీరు పారుదల లేక నిలిచిపోయి కంపు కొడుతూ దోమల ప్రబలి ప్రజలు అంటువ్యాధులకు గురవుతున్నారు. పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్, ఆంజనేయ విలాస్ హోటల్ వద్ద డ్రైనేజీ కాలువను పరిశీలిస్తే మురికి కుంటలా తలపిస్తుంది. ప్రధాన కాలువల్లో కూడా చెత్తాచెదారం చేరి ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ సమస్యతో ఆయా వార్డుల కౌన్సిలర్లు అనేక పర్యాయాలు మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేసిన పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేదు. కౌన్సిలర్ల ఫిర్యాదులతో మున్సిపల్ అధికారులు పాలకులు ఆయా వార్డుల్లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ


మార్కాపురం రోడ్డులోని జాతీయరహదారి పక్కన..

కాలువలను పరిశీలించడం తప్ప చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ప్రజల మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాల్సిన నిధులను గత స్వార్థపాలకులు వారి సొంత ప్రయోజనాల కోసం కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేయడం వలన పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు చర్యలకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మున్సిపల్ అధికారులు పాలకులు పట్టణంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సి ఉంది. మార్కాపురం రోడ్ లోని జాతీయ


ఆక్రమణల తొలగింపు (పాతచిత్రం)

రహదారి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం, సురేష్ మహల్ రోడ్, కారంపూడి రోడ్డు, వెల్లటూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ మరమ్మత్తులు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

'రౌడీలు, నేరగాళ్ల ముందు పోలీసులు ఎందుకు సాగిలబడుతున్నారు?'

ప్రజాశక్తి-వినుకొండ

రౌడీలు, నేరగాళ్ల ముందు పోలీసులు ఎందుకు సాగిలబడు తున్నారు? కారంపూడి ఘటనలో సీఐ నారాయణ స్వామిపై దాడి చేసినా, పాల్వాయిగేటులో తెదేపా ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఎమ్మెల్యే రామకష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు. హైకోర్టు కేవలం ఈవీఎం ధ్వంసం చేసిన ఒక్క కేసులోనే పిన్నెల్లికి రక్షణ కల్పించినా మిగిలిన నేరాలపై అతడిని ఇంతవరకు అదుపులోకి తీసుకోకపోవడానికి కారణమేంటని ఆయన నిలదీశారు. సొంత డిపార్ట్మెంట్ అధికారిని కొట్టినా చర్యలు తీసుకోలేనంత అసమర్థ స్థితి చేరుకున్నారా పోలీసులనేది ప్రజ లందరికీ చెప్పాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు జీవీ ఆంజనేయులు.

విధి నిర్వ హణలో ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్పై దాడి చేసి చంప బోయిన వ్యక్తి అరెస్టు విష యంలో పల్నాడు పోలీసులు చూపిస్తోన్న అల సత్వం, జాప్యం చూస్తోంటే జాలి వేస్తోందన్నారు. జరుగుతున్నవన్నీ చూస్తుంటే పిన్నెల్లి సోదరులు వారంతట వారు వచ్చి తమను అరెస్టు చేయండి అంటే తప్ప పోలీసులు వాళ్లవైపు కన్నెత్తికూడా చూసేలా లేరని ఎద్దేవా చేశారు. పోలీ సులు తమ ప్రభుభక్తిని పక్కనపెట్టకపోతే ఓట్ల లెక్కింపు సమయంలో జరిగే పరిణామాల్లో ప్రజలు, ప్రతిపక్షాలకు రక్షణ ఎవరో ఎన్నికల సంఘమే ఆలోచించాలని కోరారు జీవీ ఆంజనేయులు.

అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం టీ.బీ నియంత్రణ కార్యాలయ సిబ్బంది సమావేశం శనివారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో డాక్టర్.విజయలక్ష్మి మాట్లాడుతూ టిబి నియంత్రణ శాఖ సిబ్బందిని అడల్ట్ టీ.బి.వ్యాక్సినేషన్‌లో భాగస్వాములను చేయడం జరిగిందని, వారి పరిధిలోని మండలాలలో క్షయ వ్యాధి చికిత్స పొందుతున్న రోగులు, వారి కాంటాక్ట్స్‌ను గుర్తించి, అందరికీ అడల్ట్ బి.సి. జి.వ్యాక్సినేషన్ అందించాలన్నారు. జిల్లాకు కేటాయించిన 6 - లక్షల లక్ష్యాన్ని పూర్తిచేయడంలో భాగంగా, ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎమ్. యల్.హెచ్.పిల సహకారం తీసుకోవాలని, రాష్ట్రంలో వెనుకబడి ఉన్న గుంటూరు జిల్లాను పరస్పర సహకారంతో మొదటి స్థానానికి తీసుకొని వెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణ అధికారి డాక్టర్.దాసరి శ్రీనివాసులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.కె.వి.సుబ్బరాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి



పొన్నూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -పొన్నూరు

ప్రతి గురువారం పెద్దలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు సాంబశివ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ .మీర్ హుస్సేన్ తెలిపారు. శనివారం ఉచిత టీబీ వ్యాక్సిన్ పోస్టర్లను ఆయన, స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రయోగాత్మకంగా 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు టిబి వ్యాధి సోకకుండా ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి గురువారం ఉచితంగా టీబీ వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేస్తు న్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో గుంటూరు జిల్లాలో పొన్నూరును ఎంపిక చేసి అక్కడ టిబి వ్యాక్సిన్ గత రెండు వారాల నుండి ప్రారంభించినట్లు తెలిపారు. వాక్సిన్ ప్రక్రియ మే నుంచి జూలై వరకు కొనసాగుతోందని, సమ్మతి తెలియజేసిన వారంతా తప్పకుండా వేయించుకోవాలని ఆయన కోరారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు పొగ తాగే వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, 2018 నుంచి టీబీ బారినపడి చికిత్స పొందుతున్న వారు వేయించుకోవచ్చు అన్నారు. 2021 సంవత్సరం జనవరి 1 నుంచి టీబీ వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్ ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకునేందుకు అర్హులని డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 18 సంవత్సరాల లోపలి వారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, క్యాన్సర్ పేషెంట్లు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి వ్యాక్సిన్ అవసరం లేదన్నారు. మూడు నెలల లోపల రక్త మార్పిడి చేయించుకున్న వారు, బీసీజీ, ఇతర వ్యాక్సిన్లకు గతంలో తీవ్ర రియాక్షన్ వచ్చినవారికి టీబీవ్యాక్సిన్ అవసరం లేదని డాక్టర్ హుస్సేన్ వివరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ హెడ్ నర్స్ కనకదుర్గ, జ్యోతి, ఫార్మసిస్ట్ అనూష, ఏఎన్ఎంలు ఝాన్సీ, కోటేశ్వరమ్మ, డిఇఒ లీల తదితరులు పాల్గొన్నారు.



బాపయ్య చౌదరిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య, తదితరులు

నాట్స్ అధ్యక్షులు బాపయ్యచౌదరికి సత్కారం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్ : నిజమైన పేదలకు, పేద విద్యార్థులకు, భూమిని నమ్ముకున్న పేదరైతులు తదితరులకు సహకరించి చేయూతనివ్వడమే తన లక్ష్యమని (నాట్స్) అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి అన్నారు. శనివారం సాయంత్రం పెదనందిపాడులోని పిఎఎన్ కళాశాలలో నాట్స్ అధ్యక్షులు బాపయ్య చౌదరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యన్నారాయణ, పలువురు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధూళిపాళ్ల రాజేష్ కుమార్. ప్రజా సంఘాల నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, కళాశాల ఇన్చార్జి సూపరింటెండెంట్ డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో-11



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

'అమరేశ్వరం' శాసన సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

శాసనాల ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని ఉపాధ్యాయులు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసన సంపుటి అమరేశ్వరం ఆవిష్కరించారు. ఈ సంపుటిలోని 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల క్రితం జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, వారి ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలు ఉన్నట్లు తెలుస్తాయన్నారు. గుంటూరు జిల్లా సాంస్కృతిక, ప్రాచీన రాజకీయ విశేషాలు ఈ అమరేశ్వరం శాసన సంపుటం ద్వారా తెలుస్తుందన్నారు. 85 ఏళ్ల వయస్సులో ఈ సంకలనాన్ని రూపొందించిన డాక్టర్ వావిలాల సుబ్బారావు ప్రశంసనీయులని పేర్కొన్నారు. కార్యక్రమానికి అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించగా, ప్రభుత్వ డిగ్రీ కాలేజి విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రఫుల్లరాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, రావెల సాంబశివరావు, కోటేశ్వరప్రసాద్, కె.శివప్రసాద్, కల్లి శివారెడ్డి, నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

31వ తేదీ నాటికి ఏజెంట్ల వివరాలు అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే ఏజంట్ల వివరాలు ఈనెల 31వ తేదీలోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందించాలని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తెలిపారు. శనివారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపుపై గుంటూరు తూర్పు నియోజక వర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా జరగటానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలన్నారు. లెక్కింపు కేంద్రానికి వచ్చే ఏజంట్లు తగిన వివరాలతో ఈనెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వివరాలు ఇవ్వాలన్నారు. ఏజంట్లు తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. లెక్కింపు కేంద్రంలోకి ఎవ్వరికీ సెల్‌ఫోన్ అనుమతి ఉండదని, కేంద్రం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రంలో డిపాజిట్ చేయవచ్చని పేర్కొన్నారు. జూన్ 3వ తేదీన ఆర్ఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలిస్తామని, 4వ తేదీ ఉదయం 5 గంటలకు లెక్కింపు సిబ్బందిని టేబుల్స్ వారీగా ర్యాండమైజేషన్ మేరకు కేటాయింపు జరుగుతుందని, అభ్యర్థులు, ఏజంట్లు ఆ సమయానికి రావచ్చని, 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఈవిఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. లెక్కింపు కేంద్రంలో ఈవిఎంల లెక్కింపునకు 14, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు 4 టేబుల్స్ ఏర్పాటు చేశామని, లెక్కింపు ప్రక్రియ అంతా సిసి కెమెరాల ద్వారా రికార్డ్ చేయబడుతుందన్నారు. సమావేశంలో ఏఆర్ఓలు వెంకటలక్ష్మి, ప్రదీప్‌కుమార్, బీమరాజు, సూపరిండెంట్ పద్మనాభరావు, అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రభుత్వం మార్పు తథ్యం : ముప్పాళ్ల

ప్రజాశక్తి - తుళ్లూరు

జూన్ 4 న ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం మార్పు తథ్యమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగే శ్వరరావు అన్నారు. శనివారం తుళ్లూరులో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ స్వగృహంలో మీడియాతో ముప్పాళ్ల మాట్లాడారు.స్వయం కృతాపరాధం వల్లనే జగన్మోహన్ రెడ్డి ఓటమి పాలుకానున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వారందరూ వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేశారని అభిప్రాయ పడ్డారు. జూన్ 9 న విశాఖలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని జగన్మోహన్ రెడ్డి చెప్పడం,బొత్సా సత్యనారాయణ లాంటి మూర్ఖులు వత్తాసు పలకడం అర్థం లేనిదన్నారు. రాజధానిలో భూమిలేని పేదలకు జీవనభృతిని ఎన్నికలకు ముందు హడావిడిగా రూ 5 వేలకు పెంచి రెండు నెలలు ఇచ్చారని, వాస్తవానికి 5 ఏళ్ల నుంచి చెల్లించాల్సి ఉందని అన్నారు. రైతుల త్యాగాలను జగన్మోహన్ రెడ్డి మట్టిపాలు చేశారని, కనీసం కౌలు కూడా చెల్లించక పోవడం సిగ్గు చేటన్నారు. నూతన ప్రభుత్వం రాగానే రైతుల బకాయిలు చెల్లించాలన్నారు. పల్నాడులో హింసాత్మక చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యమే కారణ మన్నారు. దేశంలో బిజెపికి గెలుపు అవకాశాలు లేవన్నారు. రాష్ట్రంలో ఇండియా కూటమికి ఓట్లు గణనీయంగా వచ్చే అవకాశం ఉందన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : డొక్కా

ప్రజాశక్తి - తుళ్లూరు : రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా వెలుగొందాలని, ఎన్నికలలో ధర్మమే గెలుస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ అన్నారు. శనివారం రాజధాని ప్రాంతం వెంకటపాలెంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దేవస్థానంలో భక్తులకు అన్నదానం ఇతర మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయని అన్నారు. ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడుతు ధర్మం గెలుస్తుందని, అధర్మం ఓడి పోతుందన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.



దేవస్థానం వద్ద మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

నేడే ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్)మరియు శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో 26 న ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో నిర్వహిస్తున్నట్లు ఐకాంప్ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకే శిబిరం ప్రారంభం అవుతుందని, పత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా వారు కోరారు.



జిజిహెచ్‌లో రోగులను పరామర్శిస్తున్న ఆలపాటి

క్షతగాత్రులకు ఆలపాటి పరామర్శ

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదంలో గాయపడి తెనాలి జిల్లా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న బాధితులను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం పరామర్శించారు. కొల్లిపర మండలం దావులూరు పాలెంకు చెందిన కొందరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ రేపల్లె సమీపంలో ఆటోను తప్పించబోయి బోల్తా కొట్టింది. పది మందికి పైగా ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో బాధితులను తెనాలి జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న ఆలపాటి హుటాహుటిన జిల్లా వైద్యశాలకు వచ్చి, బాధితుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు. ఆర్థోపేడిక్ సర్జన్ డాక్టర్ జె.హనుమంతరావుతో ఆలపాటి మాట్లాడారు. క్షతగాత్రుల ప్రాణాలకు ప్రమాదం లేదని, అయితే కొందరికి కాళ్లు, చేతులకు సంబంధించి ఎముకలకు ఆపరేషన్ చేయాల్సి ఉందని, రెండు రోజుల్లో ఆపరేషన్ కూడా చేస్తామని ఆయన చెప్పారు. బాధితులకు అండగా ఉంటామని ఆలపాటి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేసన కోటేశ్వరరావు, పలువురు కొల్లిపర మండల టిడిపి నాయకులు ఉన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రెండురోజులు క్రితం తప్పిపోయిన బాలుడి ఆచూకి లభ్యమైనట్లు తెనాలి వన్ టౌన్ పోలీసులు శనివారం వివరాలు వెల్లడించారు. తల్లితండ్రులపై అలిగి ట్రైన్లో కాశీకి వెళ్లిన ఘటన గురువారం పాతగుంటూరులో చోటుచేసుకుంది. తెనాలి ట్రైన్లో ఓ యాత్రికుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం బాలుడు వారణాసి ప్రభుత్వ రైల్వే పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం సేకరించారు. తప్పిపోయిన బాలుడు శివకుమార్(10)గా గుర్తించి తన తల్లితండ్రులు మణికంఠ, శివదుర్గ లకు సమాచారం అందించినట్లు వన్ టౌన్ సిఐ దశరథరామారావు తెలియజేసారు.



వైభవంగా స్వామివారి మహోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరులో శనివారం శ్రీశ్రీ హజరత్ ఖాజా బంధా నవాజ్ గేసుదరాజ్ షాహబాజ్ బులంద్ పర్వాజ్ మహాత్ములవారి జెండా, గంధ మహోత్సవం నిర్వహించారు. పట్టణములోని 5 వార్డు ఇదార ఏ అమినియా చిస్టియా నుండి అతి వైభవంగా పకీర్ల , తాషా మేళా వాయిద్యాలతో విద్యుత్ కాంతుల మధ్య వైభవంగా స్థానిక ఇటకంపాడు రోడ్డులో గల జెండా చెట్టు వద్దకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఇదార కమిటీ సభ్యులు పఠాన్ బాబుఖాన్, హైదర్, మొల్లా కరీమ్, మునీర్,నిజాముద్దీన్, గౌస్ పీర్, జానీ, కాలేష, అరిఫ్, సంధాని, రీవో బాబు, అహ్మద్ అలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఎస్ అధికారి శ్రీధర్‌బాబు, వేదికపైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఏకాగ్రత, పట్టుదల ఉంటే ఐఏఎస్ సాధ్యమే

టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు



దేశంలోనే అత్యున్నత అధికార పదవి ఐఏఎస్ మాత్రమేనని, దానిని సాధించాలంటే ఏకాగ్రతతో కూడిన కషి, సాధించాలన్న పట్టుదల ఎంతో అవసరమని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ఐఏఎస్ పేర్కొన్నారు. కె.వి.ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి ఆపైన చదువుతున్న విద్యార్థులకు స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో ఐఏఎస్ సాధనపై నిర్వహిస్తున్న పది రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఐఏఎస్ అధికారి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ సాధించాలంటే ఉన్నత వర్గాల వారో, ఆర్థిక స్థితిపరులో కానక్కర్లేదన్నారు. ఏ భాషలో నైనా కనీస డిగ్రీ విద్యార్హతగా సరైన శిక్షణతో ఐఏఎస్ సాధించవచ్చన్నారు. ప్రతి సంవత్సరము సివిల్ సర్వీసెస్ కమిషన్ ద్వారా 10 లక్షల మంది దేశవ్యాప్తంగా పరీక్షలు రాస్తే అనేక వడపో తల ద్వారా కేవలం 60 మంది మాత్రమే ఐఏఎస్ కు ఎంపిక చేయబడతారన్నారు.కె.వి.ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్ మీద పూర్తిస్థాయి ఆదిపత్యం కనపరిచే వారికి ఐఏఎస్ సాధించటం చాలా సులభతరమన్నారు. ఆంగ్ల భాషపై పట్టు, భావవ్యక్తీకరణ, దినపత్రికలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే పుస్తకాలు చదవటంతో పాటు అంతర్జాతీయంగా, జాతీయంగా రోజువారి జరిగే సంఘటనలపై అవగాహన కలిగి ఉండటం ఐఏఎస్ పరీక్షలకు ప్రధాన అర్హతగా ఉంటాయని వివరించారు. కార్య క్రమంలో సన్ కోఆర్డినేటర్లు ఆశిష్, హరీష్, సంధ్య, బ్లేస్సి తది తరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎసిఎంఇ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు రూరల్ మండలం, పొత్తూరులోని ఎసిఎంఇ స్కూల్ విద్యార్థులు జూన్ 14 నుండి 17వ తేదీ వరకూ ఒరిస్సాలోని కటక్‌లో నిర్వహించే 6వ చైల్డ్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్లు నందమూరి సౌగంద్‌కృష్ణ, నందమూర్తి దీప్తి తెలిపారు. పోటీలకు ఎంపికైన లక్ష్మీకార్తీక, హస్నా, జోష్నిక, రిషాంక్, ఆరోహి, శాన్విలను వారు అభినందించారు.

నిబంధనలకు లోబడి విక్రయించాలి

విత్తన డీలర్లు, ఉత్పత్తిదారులతో సమావేశంలో డిఎఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

విత్తన ఉత్పత్తిదారులు, డీలర్లు నిబంద నలకు లోబడి వ్యాపారం నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కృషి భవన్‌లో శనివారం విత్తన ఉత్పత్తిదారులు, డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడు తూ లైసెన్స్ నిబంధనలకు లోబడి డీలర్లు వ్యాపారం నిర్వహించాలని, నిల్వ, ధరలను బోర్డులో సూచించాలని, ప్రత్యక్ష నిల్వతో సరిపోవాలని అన్నారు. స్టాకు రిజిస్టర్లు బిల్లు పుస్తకాలు, ధృవీకరణ చేయించుకొని వినియోగించుకోవాలన్నారు. విత్తనాలు వచ్చిన వెంటనే సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేసి, వారి అనుమతి తీసుకొని విుయించాలన్నారు. ప్రతి విత్తనం సర్టిఫికెట్ ఆఫ్ సోర్స్, ఇతర వివరాలు ఉండాలన్నారు. స్టాకు రిజిస్టర్‌లో పంట, రకం వివరాలు నమోదు చేయాలని, రైతులు ఏరకం కోరితే అది మాత్రమే అందించాలన్నారు. గరిష్ట ధర మించి విక్రయించకూడదన్నారు. ఎక్కువ మొత్తంలో ప్రత్తి, మిరప విత్తనాలు అమ్మినప్పుడు వ్యవసాయాధికారికి తెలియజేసి వారి ఆమోదంతోనే విక్రయించాల్సి ఉంటుందని స్పష్టం స్పష్టం చేశారు. ఎక్కువ డిమాండ్ ఉన్న విత్తనాల వివరాలు వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. గ్లైసెల్ పత్తి వితనాలు(హెచ్.టి)కి మన దేశంలో అనుమతి లేదని, కావున వాటిని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. జిఒటిలో పాస్ అయిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, ఫారం-డి ప్రతి నెలా కార్యాలయాలకు సమర్పించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎడిఎ ఎం.సునీల్, ఏఒలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్ పాల్గొన్నారు.

రాజకీయ అగ్గిని రాజేసిన ఎన్నికలు

విశ్లేషణం

రాజకీయాల్లో పల్నాడుకు ఒక ప్రత్యేకత ఉంది. కక్ష, కార్పణ్యాలు, రాజకీయ హత్యలు, దాడులతో దద్దరిల్లే పల్నాడులో తాజాగా ఎన్నికలు అగ్గిని రాజేశాయి. సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు పేరు జాతీయ స్థాయిలో మారు మ్రోగిపోతోంది. బీహార్ తరహాలో విధ్వంసం, ఘర్షణ చెలరేగడం, ఈవిఎంల ధ్వంసంపై వీడియో బహిర్గతం కావడం, అధికారుల సస్పెన్షన్, బదిలీలు, ఎమ్మెల్యేల అరెస్టుకు హైడ్రామా, వైసిపి ఎమ్మెల్యే ముందస్తు బెయిల్‌కు పిటీషన్ వేస్తే టిడిపి అభ్యర్థులపై కూడా చర్యలు తీసుకోవద్దని హైకోర్టులు ఉత్తర్వులు ఇవ్వడం తదితర అంశాలు జాతీయ స్థాయి రాజకీయాల్లో కూడా చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికలను పురస్కరించుకుని మాచర్ల, నరసరరావుపేట, గురజాల, సత్తెన పల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో అల్లర్లు చెలరేగాయి. టిడిపి, వైసిపి నాయకులు మధ్య పరస్పర దాడులు జరిగాయి. 13,14 తేదీల్లో పల్నాడు జిల్లాలో 22 ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. 581 మందిని నిందితులుగా 22 కేసులు నమోదు అయ్యాయి. మొత్తం పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు పోలీసులకు, ఎన్నికల అధికారులకు శిరోభారంగా మారాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఏపార్టీ గెలిస్తే మరో పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించ డంతో ప్రస్తుతం పల్నాడు అంతా అదనపు పోలీసు బలగాలు మొహరించి ఉన్నాయి. తాజాగా ఎనిమిది మంది సీనియర్ అధికారులను జిల్లాకు కేటాయించారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేరుగా ఈవిఎంలను ధ్వంసం చేసిన ఘటన జాతీయ మీడియాలో విస్తృత ప్రచారానికి దారితీసింది. దీంతో ఎన్నికల కమిషన్ నేరుగా జోక్యం చేసుకుని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అరెస్టుకు ఆదేశాలు ఇచ్చింది. ఆయన అరెస్టులో హైడ్రామా చేటుచేసుకుంది. పోలీసుల కళ్లు గప్పి ఆయన తప్పించుకున్నారని కూడా ఆరోపణలు వచ్చాయి. రెండు రోజుల డ్రామా తరువాత ఆయన నేరుగా హైకోర్టులో షరతులతో కూడిన ముందస్తు బెయిల్ పొందారు. రామకృష్ణారెడ్డి పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో సృష్టించిన విధ్వంసం, టిడిపి ఏజెంటును బెదిరించడం, తరువాత దాడి ఘటనలు దేశ వ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారాయి. స్వయంగా ఎమ్మెల్యే ఈ స్థాయిలో విధ్వంసంలో పాల్గొనడంపై వైసిపి, టిడిపి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. టిడిపి వారు రిగ్గింగ్‌కు పాల్పడటం వల్లే పిన్నెల్లి ఈవిఎంలను ధ్వంసం చేశారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా కలకలం రేపాయి. రిగ్గింగ్ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. లేదా రీపోలింగ్‌కు ఈసిని ఆశ్రయించాలి కానీ నేరుగా ఎమ్మెల్యే పిన్నెల్లి విధ్వంసానికి పాల్పడతారా అన్న విమర్శలు వచ్చాయి. పల్నాడు జిల్లాలో జరిగిన విధ్వంసంకు నూతన ఎస్‌పి గరికపాటి బిందుమాధవ్‌తో పాటు ఇద్దరు డిఎస్‌పిలు, ఇద్దరు సిఐలు, మరో ఇద్దరు ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ పోలింగ్ ముగిసిన తరువాత బదిలీ అయ్యారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి స్వయంగా పోలింగ్ కేంద్రంలోకి వచ్చి ఈవిఎంను, వివిప్యాట్‌ను ధ్వంసం చేసినా పోలింగ్ అధికారులు ఏమాత్రం ఫిర్యాదు నమోదు చేయలేదు. పల్నాడు అల్లర్లపై సిట్ దర్యాప్తు తరువాత ఈ ఘటన వెలుగు చూసింది. సిట్ అధికారుల దర్యాప్తు తరువాత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఈనెల 20న రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పల్నాడు జిల్లాలో మొత్తం ఏడు చోట్ల ఈవిఎంలను ధ్వంసం చేసినట్టు అధికారులు రికార్డులు నమోదు చేశారు. మిగతా చోట్ల నిందితులను అరెస్టు చేయడం, వారిపై కేసులు నమోదు చేయడంలో చురుకైనపాత్ర పోషించిన అధికారులు ఎమ్మెల్యే పిన్నెల్లిపై కేసు నమోదులో వత్తిళ్లకు తలొగ్గి జాప్యం చేశారన్న విమర్శలు వచ్చాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పిన్నెల్లిని ప్రధాన నిందితుడుగా 10 సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. సమస్యాత్మక నియోజక వర్గాలలో పూర్తిస్థాయిలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు చెప్పిన అధికారులు పిన్నెల్లిపై కేసు నమోదు చేయడానికి ఎందుకు కాలయాపన చేశారన్న అంశం తీవ్ర చర్చకు దారితీసింది. రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల అధికారులు వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించినా మిన్నకుండిపోవడం పలు సందేహాలకు తావిచ్చింది. ఈవిఎం ధ్వంసం చేయడం అంటే స్వేచ్ఛా యుత ఎన్నికల నిర్వహణలో వైఫల్యంగా రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వ్యాఖ్యానించడం విశేషం. పోలింగ్ కేంద్రంలో గొడవ జరగడం, ఈవిఎం ధ్వంసం చేయడం, పోలింగ్ అధికారులు ఎమ్మెల్యే పిన్నెల్లి రాగానే లేచి నిలబడి నమస్కారం చేయడంపై వీడియో బయటకు వచ్చిన తరువాత పోలింగ్ కేంద్రం అధికారుల సస్పెన్షన్‌కు ఈసి ఆదేశించింది.

(ఎ.వి.డి.శర్మ)

రాష్ట్రంలో తొలిసారిగా వి.ఎ.ఎక్మో చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు

ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు

వి.ఎ.క్మో చికిత్స ద్వారా యువకుడిని కాపాడిన రమేష్ హాస్పిటల్స్ వైద్యులు



మాట్లాడుతున్న వైద్యులు

రాష్ట్రంలో వి.ఎ.ఎక్మో చికిత్స ద్వారా మాసివ్ హార్ట్ ఎటాక్‌కు గురైన యువకుడిని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్య బందం చికిత్స అందించి కాపాడిందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. శనివారం హాస్పిటల్‌లో విలేకరుల సమావేశంలో చికిత్స వివరాలు వెల్లడించారు. ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్న 35 ఏళ్ల యువకుడు మంగళగిరిలోని ఒక గుడికి వెళ్లి తిరిగి వస్తూ ఛాతి నొప్పిగా, బరువుగా అనిపించి, దానిని గ్యాస్ నొప్పిగా భావించి యాంటాసిడ్ మాత్ర తీసుకున్నాడు. నొప్పి తగ్గకపోగా మరింత పెరటంతో అక్కడే నర్సింగ్ హెూమ్‌కు వెళ్లగా వారు ఈసీజీ చేసి హార్ట్ ఎటాక్ వచ్చినట్లు నిర్ధారించారు. తర్వాత గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌కు వచ్చిన రోగికి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్.రామారావు నేతత్వంలోని గుండె వైద్య నిపుణుల బందం పరీక్షలు నిర్వహించారు. గుండె పంపింగ్ తగ్గిపోవడం, కార్డియోజెనిక్ షాక్, పల్మనరి ఎడిమా వంటి క్లిష్టమైన పరిస్థితిలో ఉన్న రోగికి వెంటనే వెంటిలేటర్ అమర్చి క్యాథ్‌ల్యాబ్‌కు తరలించి ఇంట్రా అయోటిక్ బెలూన్ పంపు అమర్చి యాంజియోగ్రాం పరీక్ష నిర్వహించగా గుండెకు రక్తాన్ని అందించే ప్రధాన రక్తనాళం వందశాతం రక్తపు గడ్డలతో పూడిపోయి ఉండటం గమనించి ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ చికిత్స ద్వారా రక్తపు గడ్డలను తొలగించారు. గుండె అతివేగంగా కొట్టుకోవడం, రక్తపోటు తగ్గిపోవడం, మూత్రం కొద్దిగా రావటం, వెంటిలేటర్‌పై కూడా ఆక్సిజన్ లెవెల్స్ సరిపోకపోవడం, గుండె పనితీరు చాలా బలహీనంగా ఉండటం వంటి లక్షణాలతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ లోనికి వెళ్లడంతో చివరి ప్రయత్నంగా 'ఎక్మో' అనే లైఫ్ సేవింగ్ మెషీన్‌ను అమర్చారు. కార్డియోజనిక్ షాక్ నుంచి కోలుకున్న తరువాత ఐదు రోజులకు ఎక్మో మెషీన్ నుంచి బయటకు తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి వైద్య చికిత్స మొదటిసారిగా అస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో నిర్వహించామని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్. రామారావు తెలియజేశారు.అత్యాధునిక వి.ఎ.ఎక్మో పద్ధతి ద్వారా గుండె, ఊపిరితిత్తుల మీద పూర్తిగా ఒత్తిడి తగ్గించి కత్రిమంగా ప్రాణ వాయువును శరీరానికి అందించడం ద్వారా రోగి త్వరగా కోలుకున్నాడని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్.పి.ఎన్.ఎస్.హరిత తెలిపారు. సడెన్ హార్ట్ ఎటాక్ వలన సంభవించే దుష్ఫలితాలను అధిగమించడానికి ఈ తరహా వైద్యం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్య బృందం డాక్టర్.రామారావు, డాక్టర్.శిల్పా చౌదరి, డాక్టర్.జయరామ్‌పాయ్, డాక్టర్. శివప్రసాద్, ఎక్మో స్పెషలిస్ట్ డాక్టర్.బికాస్‌సాహాను ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు అభినందించారు. సమావేశంలో హాస్పిటల్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.మమత రాయపాటి, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్.కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.